క్లుప్తంగా

మహానంది ఎంపీడీఓగా శ్రీనివాసరెడ్డి



మహానంది: మహానంది ఎంపీడీఓ(ఎఫ్ఏసీ)గా ఏఓ శ్రీనివాసరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఈఓఆర్డీ శివనాగజ్యోతి నుంచి శ్రీనివాసరెడ్డి బాధ్యతలు తీసుకున్నారు.

నిస్వార్థ ప్రజాసేవకుడు గాడిచర్ల

వెలుగోడు: గాడిచర్ల హరిసర్వోత్తమరావు నిస్వార్థ ప్రజాసేవకుడు, నిష్కళంక దేశభక్తుడని లిటిల్ ఏంజిల్స్ పాఠశాల కరస్పాండెంట్ ఎంఎఫ్ ఇమ్మానుయేలు కొనియాడారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం గాడిచర్ల హరిసర్వోత్తమరావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారిణి ఎన్వీ సుమలత, ఇమ్మానుయేలు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

తాగునీటి సమస్యలకు ప్రాధాన్యత

మహానంది: గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు బండిఆత్మకూరు ఎంపీడీఓ విజయరావు తెలిపారు. బండి ఆత్మకూరు మండలం యర్రగుంట్లలోని ఎస్సీ కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి మోటారు బిగించడంతో పాటు పైప్‌లైన్ పనులను గురువారం ప్రారంభించారు.

బదిలీ సర్వసాధారణం



కమిషనర్ కిషోర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి బాలమద్దయ్య అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన కమిషనర్ కిషోర్‌కు మున్సిపల్ సిబ్బంది శాలువ కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

కొలతల మేరకు పనులు చేయాలి



ఉపాధి కూలీలకు సూచనలు చేస్తున్న జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్

పగిద్యాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనికి వెళ్తున్న కూలీలు సిబ్బంది ఇచ్చిన కొలతల మేరకు పనులు చేయాలని జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్ తెలిపారు. గురువారం మండలంలోని ఆంజనేయనగర్ గ్రామంలో జరిగే ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కోరిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలని ఏపీఓ మద్దిలేటికి ఆయన ఆదేశించారు. ఎవరైనా బోగస్ హాజరుకు పాల్పడితే ఆ మేట్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఘనంగా గంధం వేడుకలు

పాములపాడు: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో గురువారం మస్తాన్‌వలి గంధం వేడుకలు ఘనంగా జరిగాయి. ఉరుసు వేడుకల్లో భాగంగా రాత్రి గంధం పెట్టెకు ముజావర్ బాదర్లా సాహేబ్ ప్రత్యేక ఫాతేహాలు చేశారు. అనంతరం గంధం పెట్టెకు మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

మహానంది: మహానందిలో పిచ్చికుక్క స్వైర విహారం చేయడంతో ఐదుగురికి గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. మహానందిలోని పార్వతీపురం, ఈశ్వర్‌నగర్ కాలనీలకు చెందిన జమాల్, జహీనా, హారిక, పిచ్చమ్మలతో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108లో తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. చిన్నారి జహీనాను మెరుగైన వైద్యం కోసం వైద్యులు నంద్యాల ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు.

నలుగురిపై కేసు నమోదు

మహానంది: ఇళ్ల మధ్య ఉన్న కాలువ విషయంలో ఇరువురి మధ్య ఘర్షణకు దారితీసిన ఘటన గురువారం గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో చోటుచేసుకుంది. ఇళ్ల మధ్య కాలువ విషయంపై పంచాయతీ చేసిన పెద్ద ఎల్లయ్యపై అదే గ్రామానికి చెందిన వీరేష్, మరో ముగ్గురు కలిసి దాడి చేశారు. బాధితుడు పెద్ద ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

స్థలాల ఆక్రమణపై విచారణ



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలకేంద్రంలో ఆక్రమణకు గురైన ఇండోర్ స్టేడియం, మెగా గోకులం షెడ్డు స్థలాలపై గురువారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, సివిల్ సప్లైడీటీ నాగన్న, మండల సర్వేయర్ సహనా పర్వీన్, వీఆర్వోలు ఆక్రమణకు గురైన స్థలాలను పరిశీలించారు. కాగా ఇండోర్ స్టేడియం స్థలానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు రెవెన్యూ కార్యాలయంలో లేకపోవటం గమనార్హం. అలాగే మెగాగోకులం షెడ్డు నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో ఎలాంటి కట్టడాల్లేవని రెవెన్యూ అధికారుల విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. 717 సర్వేనెంబర్‌లో ఇండోర్ స్టేడియానికి కేటాయించిన 5.70ఎకరాల స్థలంలో 20 సెంట్ల స్థలాన్ని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జంగాల పెద్దన్న సెంటు రూ.30వేల చొప్పున రూ.6లక్షల కు గ్రామానికి చెందిన ఇప్పె పుల్లయ్యకు విక్రయించి సొమ్ముచేసుకొన్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది.

మహాశివరాత్రికి మహానంది ముస్తాబు

- 20 ఎకరాల్లో వాహనాల పార్కింగ్
- దర్శనం టికెట్లకు ఏడు, ప్రసాదాల విక్రయానికి 8 కౌంటర్లు
- 1.50 లక్షల లడ్డూలు సిద్ధం
- వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్లు
- భక్తుల కోసం మూడు వైద్య శిబిరాలు



మహానంది ఆలయం

మహానంది: రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న మహానంది ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఉత్సవాల సందర్భంగా మహానందికి వచ్చే వేలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది మరింత మెరుగ్గా ఉత్సవాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులతో రెండు పర్యాయాలు కోఆర్డినేషన్ సమావేశాలు ఏర్పాటు చేసి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. అలాగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి నిత్యం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారు. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఐదు రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

ఆర్జితసేవా టికెట్లకు ఏడు కౌంటర్లు

ఉత్సవాలకు వేలాది సంఖ్యలో వచ్చే భక్తుల సౌకర్యార్థం మహానంది దేవస్థానంలో ఏడు ఆర్జితసేవా దర్శనం టికెట్ల కౌంటర్లు ఏర్పాటు చేయనున్నామని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయం ముఖ మండపం వద్ద మూడు, వెలుపల మరో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు లడ్డూ, పులిహోర ప్రసాదం టికెట్లు ఇచ్చేందుకు నాలుగు చొప్పున కౌంటర్లు, ఒక పబ్లికేషన్ కౌంటర్ ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రత్యేక క్యూలైన్లు

వీఐపీలతో పాటు భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా లఘు దర్శనం (రూ.20), శీఘ్రదర్శనం(రూ.50), అతి శీఘ్రదర్శనం (రూ. 100)లకు లోపలి కోనేరు చుట్టూ శాశ్వత క్యూలైన్లు ఏర్పాటు చేశారు. దీంతో పాటు వృద్ధులు, వికలాంగులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ప్రత్యేక దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రథశాల సెంటర్, పార్కింగ్ ప్రదేశాలతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద ఎల్లప్పుడూ తాగునీరు ఉండేలా డ్రమ్ములను ఏర్పాటు చేసి ట్యాంకర్ ద్వారా సరఫరా చేయనున్నారు. దాతల ఆధ్వర్యంలో భక్తులకు రెండ్రోజుల పాటు మజ్జిగ అందించనున్నారు.

1.50లక్షల లడ్డూలు సిద్ధం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో గతేడాది 1.20లక్షల లడ్డూ ప్రసాదాలను విక్రయించారు. ఈ ఏడాది భక్తుల సంఖ్య మరింత పెరగనున్న నేపథ్యంలో గతేడాది కంటే అదనంగా ఈ ఏడాది 1.50లక్షల లడ్డూలు సిద్ధం చేయనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వచ్చిన ప్రతి భక్తుడికి ప్రసాదం అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఈ ఏడాది రథ మండపానికి సుమారు రూ.లక్ష వెచ్చించి వేయించిన మహా'ఈశ్వరుడి' చిత్రం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది.



భక్తుల కోసం సిద్ధమవుతున్న లడ్డూ ప్రసాదాలు


మూడు వైద్య శిబిరాలు

మహానందీశ్వరుడి బ్రహోత్సవాల సందర్భంగా వేలాది సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా మూడు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. తిమ్మాపురం, గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో రెండు, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఒకటి మూడు వైద్యశిబిరాలు నిర్వహిస్తారు. చిన్నకోనేరు వద్ద ఒకటి, వినాయకనంది ఆలయం వద్ద ఒకటి, గరుడనంది ఆలయం వద్ద వైద్యశిబిరాలు భక్తులకు అందుబాటులో ఉంటాయి.

పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా

మూడేళ్ల క్రితం వాహనాల పార్కింగ్ కోసం భక్తులు అష్టకష్టాలు పడేవారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ప్రైవేటు స్థలాల్లో పార్కింగ్ ఏర్పాటు చేయడంతో భక్తులు మండుటెండల్లో నడుచుకుంటూ వచ్చేవారు. భక్తుల కష్టాలను దృష్టిలో ఉంచు కుని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆలయానికి కూతవేటు దూరంలోనే పార్కింగ్ కోసం పొలాలను చదును చేయించి సౌకర్యంగా తీర్చిదిద్దారు. మహానంది, గాజులపల్లె మార్గాల వైపు వాహనాల పార్కింగ్ కోసం 20 ఎకరాల స్థలం కేటాయించడంతో పార్కింగ్ కష్టాలు తప్పాయి.

భక్తులు మెచ్చేలా సేవలు



మహాశివరాత్రి ఉత్సవాలకు మహానందికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. మహానందీశ్వరస్వామి దర్శనం అందరికీ అందేలా చేస్తున్నాం. వృద్ధులు, వికలాంగులకు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచుతాం. మహాలింగోద్భవం రోజున ప్రతి భక్తులు లింగోద్భవ అభిషేకాన్ని తిలకించేలా అవకాశం కల్పిస్తాం. రెండేళ్ల నుంచి ఆలయానికి కూతవేటు దూరంలోనే పార్కింగ్ ఏర్పాటు చేయడంతో భక్తులు ఎంతో హర్షిస్తున్నారు. భక్తులు మెచ్చేలా సేవలు అందించమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ, మహానంది

డయల్ యువర్ ఈఓ పునఃప్రారంభించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో డయల్ యువర్ టెంపుల్ ఈఓ కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని బీజేపీ మండల నాయకుడు సోమిశెట్టి వెంకట మల్లికార్జున డిమాండ్ చేశారు. గతంలో ఈ కార్యక్రమం ఉండడంతో భక్తులు నేరుగా కార్యనిర్వహణాధికారితో ఫోన్‌లో సమస్యలను, విరాళాలను, అభివృద్ధి విషయాలను మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు ఆలయ అభివృద్ధికి తోడ్పడేవారన్నారు.

షాదీఖానాకు నిధులివ్వండి

శ్రీశైలంప్రాజెక్ట్: మండల కేంద్రమైన సున్నిపెంటలో ముస్లిం షాదీఖానాకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన రూ.1,00,00,000 నిధులను విడుదల చేయాలని స్థానిక ముస్లిం పెద్దలు గురువారం శ్రీశైలంలో జేసీ రాహుల్‌కుమార్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. గతంలో ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పాత భవనాన్ని షాదీఖానాకు కేటాయించిందని, పూర్తిస్థాయి భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేశారని వివరించారు. అయితే తీర్మానాలు లేవనే కారణంగా నిధులను అధికారులు విడుదల చేయడం లేదని వివరించారు. నాయకులు గౌస్‌మొహిద్దీన్, ఎ.ఎస్.ఇస్మాయిల్, మగ్బూల్, మహమ్మద్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

మినీ జాబ్ మేళాకు స్పందన

నందికొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన చేసిన మినీ జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. స్కిల్ హబ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు 105 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. గ్రీన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, గరుడ సర్వీసెస్ ప్రైవేట్ కంపెనీలు విచ్చేసి నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 32 నిరుద్యోగులు ఉద్యోగ అవకాశలు పొందినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సునీత తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి సుబ్బన్న, ఆయా కంపెనీల హెచ్ఆర్‌లు నాగరాజు, ఉదయ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న చైర్మన్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: వేసం కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ అభివృద్ధిపై, నీటి సమస్యపై ప్రజాప్రతినిధులు చర్చించారు. మంచినీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలంటూ 24వ వార్డు చాంద్‌బాషా, 17వ వార్డు రవూఫ్, 12వ వార్డు లాలు ప్రసాద్ డీఈ నాయబ్ రసూల్‌ను కోరారు. చైర్మన్ మాట్లాడుతూ ఎండకాలంలో నీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పట్టణంలో సుమారు రూ.35 కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందని చెప్పారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్ ప్రశాంతి, డీటీ సోమేశ్వరమ్మ, టీపీఓ బాలమద్దయ్య, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ

మిడుతూరు: శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ నూతన ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలను గురువారం గిరిధర్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా సాగింది. ఉదయం 6 గంటలకు ప్రాతఃకాల పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం 10.40 గంటలకు యంత్రప్రతిష్ఠ, శిఖర, ధ్వజ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, బింబకల్యాణం, కక్షాజ్వాల దర్శణం తదితర విశేష పూజాధిత కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. మధ్యాహ్నం డోలు విద్యాంసుడు నారాయణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆలయ గాలి గోపురం (రాజ గోపురం) ప్రారంభం

శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ నూతన గాలిగోపురాన్ని (శిఖరం) శ్రీ దత్త ఆశ్రమ వ్యవస్థాపకులు, వేదపండితులు జూలకంటి మల్లికార్జున రావు శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. స్వాతి నక్షత్రం దివ్యమైన ముహూర్తంలో నూతన శిఖరం, ధ్వజస్తంభం ప్రతిష్ఠించడంతో ఆలయానికి మహర్దశ పట్టనుందన్నారు. కార్యక్రమంలో ఈఓ గురెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బన్నూరు నాగిరెడ్డి, యరభం ప్రభాకర్ రెడ్డి, దొంతు కృష్ణమూర్తి పాల్గొన్నారు.



ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

ఆలయ పునఃప్రతిష్ఠ

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో గురువారం లక్ష్మీ చెన్నకేశవ, ఆంజనేయస్వామి దేవాలయ పునఃప్రతిష్ఠ శిఖర, ధ్వజ స్తంభం, నాభిశిల ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా జరిగాయి. పురోహితులు బాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు సమన్వయకర్త దారా సుధీర్, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, జెడ్పీటీసీ పుల్యాల దివ్య హాజరయ్యారు.

ఎన్ని జెండాలు కలిసినా విజయం వైఎస్సార్‌సీపీదే





ఎమ్మెల్యే శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గుంతకందాల గ్రామస్తులు, టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్న 11వ వార్డు సభ్యులు

- ఎథిక్స్ కమిటీ చైర్మన్ శిల్పా చక్రపాణిరెడ్డి
- గుంతకందాల గ్రామంలో 70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

వెలుగోడు/ఆత్మకూరు: వచ్చే ఎన్నికల్లో ఎన్ని జెండాలు కలిసి వచ్చినా, విజయం మాత్రం వైఎస్సార్‌సీపీదే అని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. తాము శ్రీశైలం నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధితో పాటు కార్యకర్తలను ఎంతో ఆప్యాయంగా ఆదరిస్తున్న తీరును చూసి టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు చెప్పారు.

పార్టీలో చేరిన వారు..

➤గుంతకందాల గ్రామంలో చాంద్ బాషా, గౌస్ మొహిద్దీన్, అబ్బాస్ మియా, పెద్ద బాలుడు, శివ, రాజారావుతో పాటు 70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.

➤ఆత్మకూరు పట్టణంలో 11వ వార్డులో 60కుటుంబాలకు చెందిన సభ్యులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆ వార్డుకు చెందిన మహబూబ్, మన్సూర్, టైలర్‌సత్తార్, ఇస్మాయిల్, నజీర్ అహమ్మద్‌తో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు టీడీపీని వీడి ఎమ్మెల్యే శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు.

➤మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 10 మాజీ సైనిక కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో చేరాయి. మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రభాకరొట్టి ఆధ్వర్యంలో సుబ్బయ్య, బాషా, సలీం, సత్యనారాయణ, శివయ్య, శంకరయ్య, నటరాజ్, రాముడు, రాముడు పార్టీలో చేరారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా..

పట్టణంలోని కొండా ఫంక్షన్ హాల్‌లో కరివేన గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు శివయ్య కుమారుడి వివాహ వేడుకలకు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

మాట నిలబెట్టుకున్న కార్తీక్‌రెడ్డి

గుంతకందాల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆనంద్ అనే వ్యక్తి మరణించాడు. అతని కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తానని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డి మాట ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు గురువారం ఆనంద్ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే ఎంపీపీ లాలం రమేష్ కూడా మరో రూ.5 వేలు కలిపి మొత్తం రూ.15 వేలు బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, జేసీఎస్ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, నాయకులు శివయ్య, సుధాకర్‌నాయక్, సర్పంచ్ మేలు అచ్చమ్మ, ఎంపీటీసీ సుమలత, మేలు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఆత్మకూరు పట్టణంలోని ఎస్బీజీపాలెంకు చెందిన నాగన్న కుమారుడు ప్రదీప్ రక్తహీనతతో బాధపడుతుండటంతో రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. మెరుగైన వైద్యం కోసం పూర్తిస్థాయిలో సహకరిస్తానని హామీ ఇచ్చారు. పట్టణానికి చెందిన మున్ని కుమార్తె వివాహ వేడుకలకు రూ.4వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, వార్డు సభ్యులు సుందర్‌రావు, ప్రదీప్, మగ్బూల్‌బాషా, అంజాద్‌అలీ పాల్గొన్నారు.

పల్స్‌పోలియో పోస్టర్ల ఆవిష్కరణ

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం పల్స్ పోలియో పోస్టర్లను ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఆవిష్కరించారు. మార్చి 3న నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయాలని పట్టణ వైద్యాధికారి సాజిదా కోరారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయేంద్ర, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల తరహా అభివృద్ధి చేస్తాం

- వైఎస్సార్‌సీపీకి మరోసారి అవకాశం ఇవ్వండి
- ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



నాగలూటిలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, ఎంపీ పోచా, డాక్టర్ దారా సుధీర్

మిడుతూరు: మరోమారు అవకాశం ఇస్తే నందికొట్కూరు నియోజకవర్గాన్ని.. పులివెందుల తరహా అభివృద్ధి చేసి చూపిస్తానని ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివని, రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుతోపాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ఐదేళ్ల పాలనలో ముందుకు కొనసాగుతున్నామన్నారు. గురువారం మండలపరిధిలోని తలముడిపి, నాగలూటి గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. నాగలూటి సర్పంచ్ తమిదల ఉషారాణి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసి రెడ్డి ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలతో బాణసంచా పేలుస్తూ పూలవర్షం కురిపించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

➤తలముడిపి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కింద చేపట్టిన సీసీ రహదారులు, ఎంపీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ వెంకటేశ్వర్లు వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లు శివనాగిరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు.

➤మినరల్ వాటర్ ప్లాంట్లు, జగనన్న కాలనీలో నూతనంగా సీసీ రహదారులను, గడప గడపకు మన ప్రభుత్వం కింద గ్రామంలో సీసీ రోడ్లు, పంచాయతీ నిధులతో వేసిన రోడ్లు, ఎంపీ నిధులతో పొలాలకు వెళ్లే గ్రావెల్ రోడ్లు ప్రారంభించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.

నాగలూటి ప్రజల రుణం తీర్చుకోలేనిది...

తన రాజకీయ జీవితంలో మొదటినుండి వెన్నంటు ఉంటూ నడిపిస్తున్న స్వర్గీయ తమిదల పుల్లారెడ్డి కుటుంబం, నాగలూటి ప్రజల రుణం తీర్చుకోలేనిదని , ఎల్లవేళాల ఆ కుటుంబానికి నాగలూటి ప్రజలకు అండగా ఉంటానని ఏపీశాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు.

ఎంపీ పోచా సహకారం మరువలేనిది..

ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎంపీ నిధులతో తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు శాప్ చైర్మన్ తెలిపారు. అడిగిన వెంటనే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పర్వత యుగంధర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, ఎంపీడీఓ గంగావతి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కో–ఆప్టెడ్ సభ్యులు మౌలా, నాయకులు ఎల్లారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, అబ్దుల్ కరీం, నీలకంఠేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ ప్రారంభం

పగిడ్యాల: లక్ష్మాపురం అంచె వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్మాణ్ సంస్థ లక్షలాది రూపాయాల వ్యయంతో నిర్మించిన మంచినీటి పైప్‌లైన్‌ను గురువారం ఎంపీ పోచా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా నీటి సమస్యతో విద్యార్థినులు అల్లాడిపోతున్నారని సిద్ధార్థరెడ్డి తన దృష్టికి తెచ్చారని వెల్లడించారు. 600 మందికి పైగా ఉన్న విద్యార్థినులు ప్రతి రోజు ఎదుర్కొంటున్న కష్టాలను ఆదమా కంపెనీ రీజనల్ మేనేజర్ సతీష్‌కుమార్ లింగారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి లక్ష్మాపురం నుంచి దాదాపు 3 కి.మీ. మేరకు పైప్‌లైన్ వేయించి పాఠశాలకు నీటిని సరఫరా చేయడం ప్రశంసనీయమన్నారు. నందికొట్కూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దారా సుధీర్, పాఠశాల ప్రిన్సిపాల్ రమణమ్మ, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, జెడ్పీటీసీ పుల్యాల దివ్య, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి, సచివాలయ కన్వీనర్ రమేష్‌నాయుడు, మండల కో ఆప్షన్ సభ్యుడు అస్లాంబాషా, సర్పంచ్ సుజాత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉస్మాన్‌బాషా, ఆదమా కంపెనీ సీఈఓ అనురాధ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి ఏడాది కల్యాణోత్సవం, తెప్పోత్సవం నిర్వహించేందుకు ఆర్థిక సహకారం అందిస్తున్న దాతలకు ఆలయ అధికారులు గురువారం బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలు అందించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని, ఏఈఓ వెంకటేశ్వరుడులు తెప్పోత్సవం దాత నంద్యాలలోని ఏజీఎస్ జువెలర్స్ అధినేత అవ్వారు గౌరీనాథ్, సరస్వతీ దంపతులతో పాటు కల్యాణోత్సవం దాత కూరగాయల ప్రసాద్ దంపతులకు ఆహ్వానపత్రికలు అందించారు. వారితో పాటు మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవించంద్ర కిషోర్‌రెడ్డి, డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎస్‌హెచ్ శంకర్‌రెడ్డి తదితరులను ఉత్సవాలకు ఆహ్వానించారు.



మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డికి ఆహ్వానపత్రిక ఇస్తున్న ఈఓ, పండితులు

దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలి

ఆలయ పరిధిలోని హోటళ్లు, షాపుల నిర్వాహకులు తమ దుకాణాల వద్ద వస్తువులు, ఆహార పదార్థాల ధరల బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశించారు. మహానంది దేవస్థానం కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామానికి చెందిన చాకలి శ్రీనివాసులు(54) అనే వ్యక్తి ఈనెల 25న పాముకాటుకు గురై కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతిచెందాడు. సర్పంచ్ మాధవరం ప్రకాశం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

కొత్తపల్లి: ఆత్మకూరు – దుద్యాల గ్రామాల మధ్యలో కుమ్మరికుంట మలుపువద్ద బైక, స్కూటీ ఎదురెదురుగా ఢీకొనడంతో పాములపాడు మండలం లింగాల గ్రామానికి చెందిన శేఖర్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. 108లో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స కోసం తరలించారు.

రాడ్డుతో యువకుడిపై దాడి

మహానంది: గోపవరం గ్రామానికి చెందిన సంతోష్ మామతో కలసి బైక్‌పై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన నిరంజన్ బైకు రోడ్డుపై అడ్డంగా ఉంది. కొద్దిగా పక్కకు జరుగు అన్నందుకు ఇద్దరి మధ్య వాదోపవాదాలు చోటు చేసుకోగా సంతోష్‌పై నిరంజన్ ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ చెప్పారు.

స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

పాములపాడు: మండల కేంద్రంలో జగనన్న లేఅవుట్‌లోని ఇంటి స్థలాల లబ్ధిదారులకు సర్పంచ్ మేకల భాగ్యమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరెడ్డి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ సరస్వతీ, డీటీ పఠాన్‌బాబు, మాజీ సర్పంచ్ విజయసింహారెడ్డి పాల్గొన్నారు.

కొత్తపల్లి/జూపాడుబంగ్లా: మండల పరిధిలోని ముసలిమడుగులో లబ్ధిదారులకు సర్పంచు శివపురం జమిలాబీ, జూపాడుబంగా మండలం తర్తూరులో సర్పంచ్ పెద్దముంతల నాగిరెడ్డి రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేశారు.



పాములపాడులో రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ